# ఫార్మా విలేజ్‌లు ఎప్పుడు?


**నాలుగు నెలలు కావస్తున్నా ఎటూ తేల్చని సర్కారు**

**సీఎం ప్రకటించినా ముందుకు సాగని ప్రతిపాదనలు**

**పరిశ్రమలకు ప్రభుత్వ భూములు లేక ఇబ్బందులు**

**స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తుందని ఆందోళన**

**ప్రభుత్వ తీరుతో సందిగ్ధంలో పెట్టుబడిదారులు**



హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుపై అడుగు కూడా ముందుకు పడలేదు. తొలుత మూడు జిల్లాల్లో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి నెల గడుస్తున్నా ఎటువంటి పురోగతి లేదు. ఫార్మా పరిశ్రమలు ఒకచోట కేంద్రీకృతం కాకుండా రాష్ట్రంలోని నలువైపులా పెడతామని ప్రభుత్వం ప్రకటించింది కానీ, ఇంతవరకు ఎలాంటి ప్రతిపాదన రూపొందించ లేదు. దీంతో పరిశ్రమ ఏర్పాటుపై పెట్టుబడిదారులు సందిగ్ధంలో పడ్డారు. రాష్ట్రంలో గత కేసీఆర్ సర్కారు చేపట్టిన ఫార్మా సిటీని రద్దుచేస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ, సరైన ప్రణాళికలు లేక ప్రభుత్వ ఆలోచనలు ముందుకు సాగడంలేదు. సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో పది ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ ఇటీవల బయోఏషియా సదస్సులో ప్రకటించారు. తొలుత వికారాబాద్, మెదక్, నల్లగొండలో వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒక్కో విలేజ్ 1,000 నుంచి రెండు వేల ఎకరాల్లో నెలకొల్పనున్నట్టు పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఫార్మా పరిశ్రమలు ఒకేచోట పెడితే ఆ ప్రాంతమంతా కాలుష్యమవుతుందని, కాలుష్యానికి తావు లేని విధంగా రాష్ట్రం నలుదిక్కులా ఫార్మా విలేజ్‌లు ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫార్మా విలేజ్‌ను 1000 నుంచి 2000 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినప్పటికీ జిల్లాల్లో ఇంత పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములు ఒకేచోట అందుబాటులో లేవని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ రైతుల నుంచి భూములను సేకరించాల్సివస్తే.. అది సరికొత్త తలనొప్పులకు దారితీస్తుందని పేర్కొంటున్నాయి. మరోవైపు, ఇప్పటికే జీడిమెట్ల, బాలానగర్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమలు కొలువుదీరాయి. జీనోమ్ వ్యాలీలో అనేక ఆర్‌అండ్‌డీ కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమలకు అవసరమైన ఎకో సిస్టం అభివృద్ధి చెందింది. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం నగరానికి దూరప్రాంతంలో వేర్వేరు చోట్ల ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించడం పట్ల పరిశ్రమవర్గాలు పెదవి విరుస్తున్నాయి.

### పర్యావరణ అనుమతులకు ఇబ్బందులు

తొలిదశలో మూడు జిల్లాల్లో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని సీఎం ప్రకటించడంతో పరిశ్రమలశాఖ అధికారులు ఆయా జిల్లాల్లో భూముల వేటలో పడ్డారు. పరిశ్రమలకు అనువైన భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్లకు లేఖలు రాశారు. భూముల ఎంపిక తర్వాత ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులు భావిస్తున్నారు. ఆ జిల్లాల్లో పెద్దమొత్తంలో ప్రభుత్వ భూములు లేకపోవడం ఒక ఎత్తైతే, ఔషధ పరిశ్రమల ఏర్పాటు పట్ల స్థానికులు ఏ విధంగా స్పందిస్తారో అధికారులను వేధిస్తున్న ప్రశ్న. రైతుల నుంచి భూములు సేకరించాలంటే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. భూములు సేకరించినప్పటికీ వాటికి పర్యావరణ అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. కేంద్రం నుంచి ఈ అనుమతులు తేవడం ఎంతో వ్యయప్రయాసలతో కూడిన ప్రక్రియ. ఒకవేళ అన్నీ సవ్యంగా సాగి ఫార్మా విలేజ్ సిద్ధమయినా... ఎయిర్‌పోర్టుకు దూరంగా ఉండే ఫార్మా విలేజ్‌ల పట్ల కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఏ మేరకు ముందుకొస్తాయో అనేది అంతుబట్టకుండా ఉన్నది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రత్యేకంగా ఫార్మా క్లస్టర్లను ఏర్పాటుచేసి భారీ రాయితీలతో కంపెనీలను ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత ఫార్మా విలేజ్‌ల భవితవ్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

### అన్నీ సిద్ధంగా ఉన్నా... ప్రభుత్వ నిరాసక్తత

రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలో ఫార్మాసిటీని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ముందుకొచ్చాయి. ఫార్మాసిటీని సుమారు 16,000 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, దాదాపు 13,000 ఎకరాల వరకు భూసేకరణ కూడా పూర్తయింది. తొలిదశలో సుమారు 10 వేల ఎకరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, దీనికి పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. 350కిపైగా కంపెనీలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే పరిశ్రమల ఏర్పాటునకు కంపెనీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఇంతలోనే రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ముచ్చర్ల ఫార్మాసిటీని రద్దు చేసింది. ప్రస్తుతానికి ఫార్మాసిటీ ప్రతిపాదనను పక్కకుపెట్టాలని, తాము సరికొత్త ప్రతిపాదనతో వస్తామని ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఫార్మా పరిశ్రమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని పరిశ్రమవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశంలోనే ఔషధ రాజధానిగా, ప్రపంచానికే వ్యాక్సిన్లను సరఫరా చేస్తున్న హైదరాబాద్ నగరం... మున్ముందు ఫార్మా రంగంలో ఏ మేరకు పురోగతి సాధిస్తుందో అంతుబట్టడంలేదని వారు పేర్కొంటున్నారు.



ఏటీజీసీ బయోటెక్ సీ బ్లాక్ ప్రారంభోత్సవంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

## ఏటీజీసీ బయోటెక్‌కు భూమిపూజ

**వ్యవసాయంలో మరిన్ని ఆవిష్కరణలు అవసరం: మంత్రి తుమ్మల**

శామీర్‌పేట, మార్చి 30: ప్రపంచ దేశాలకు అన్నం పెట్టే దేశంగా భారత్ అవతరించబోతున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. జినోమ్ వ్యాలీలో ఏటీజీసీ బయోటెక్ అగ్రి ఇన్నోవేషన్ బ్లాక్-సీ కోసం శనివారం మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అత్యధిక జనాభ కలిగిన దేశం అయినప్పటికీ వ్యవసాయ రంగం అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, కరోనా సమయంలో దేశం మొత్తం స్తంభించినప్పటికీ వ్యవసాయ పనులు నిలిచిపోలేదన్నారు. ఎటువంటి క్రిమి సంహారక పురుగు మందులు లేని ఉత్పత్తులను తయారు చేస్తున్న ఏటీజీసీని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. దీంట్లోభాగంగా కంపెనీకి చెందిన పరిశోధన సెంటర్, ప్రొడక్షన్ యూనిట్లు, ఇన్నోవేషన్ సెంటర్లను సందర్శించారు కూడా. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ రామచంద్ర తేజావత్, హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అప్పారావు, బయో ఎస్తేటిక్స్ సీఎండీ జీవీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్, ఏటీజీసీ సంస్థ అధికారులు హాజరయ్యారు.

## జేబీ ఇనిస్టిట్యూట్‌లో ఇన్నోవేషన్ సెంటర్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన జేబీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకుగాను కొత్తగా ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను శనివారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా సంస్థలు కళాశాల స్థాయిలోనే ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు పుట్టుకువస్తాయన్నారు. అలాంటి వారికి రాష్ట్రంలోనే కాకుండా దేశ, విదేశాల్లోనూ ఆర్థికంగా, టెక్నాలజీ పరంగా సహకారం అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు.



జేబీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థలో కొత్త ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభ దృశ్యం

## '2 లక్షల కంపెనీ సెక్రటరీలు అవసరం'

హైదరాబాద్, మార్చి 30: భారత్‌లో కంపెనీ సెక్రటరీలకు డిమాండ్ అధికంగా ఉన్నదని, 2047 నాటికి కొత్తగా 2 లక్షల మంది అవసరమవుతారని ఐసీఎస్ఐ జాతీయ ప్రెసిడెంట్ బీ నరసింహన్ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 72 వేల మంది కంపెనీ సెక్రటరీలు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఐసీఎస్ఐ నుంచి ప్రతియేటా 14 వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని, డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ సంఖ్యను ఈ ఏడాది రెండింతలు పెంచనున్నట్లు ఆయన ప్రకటించారు.

## భారత్‌ను బలోపేతం చేయాలి

**ఆ బాధ్యత వ్యాపార, పారిశ్రామిక రంగాలదే: ముకేశ్ అంబానీ**

ముంబై, మార్చి 30: బలమైన, వృద్ధిదాయక భారత నిర్మాణానికి కృషి చేయాల్సిన బాధ్యత వ్యాపార, పారిశ్రామిక రంగాలపై ఉన్నదని దేశంలోనే శ్రీమంతుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ అన్నారు. రత్నాలు, ఆభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) శనివారం ఇక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమానికి ముకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే కొన్ని దశాబ్దాల్లో భారతీయ ఎగుమతులు 100 బిలియన్ డాలర్ల స్థాయిని తాకగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 'వ్యాపార రంగంలో ఉన్న మనందరిపై మరింత బలమైన, వృద్ధిదాయక భారత్‌ను నిర్మించే బాధ్యత ఉన్నది. అంతా కలిసి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వికసిత భారత్ కలను సాకారం చేద్దాం' అని అన్నారు. అన్ని రంగాల్లో ఈ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. కాగా, గడిచిన కొన్ని దశాబ్దాలుగా రాణిస్తున్న దేశీయ రత్నాలు, వజ్రాల పరిశ్రమకు ముకేశ్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎగుమతులు 40 బిలియన్ డాలర్లకు చేరాయని, 50 లక్షలకుపైగా ఉద్యోగాలను సృష్టించారని కొనియాడారు. ఈ పరిశ్రమ పురోగతిలో పలన్‌పూర్ వాసుల పాత్ర ఎక్కువగా ఉండటం తనకు గర్వంగా ఉందన్నారు. తామూ వారితో కలిసి పనిచేస్తున్నట్టు చెప్పారు. ఇక తన కోడలు శ్లోకా మెహతా కూడా ఈ రంగంలోనే ఉండటంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు జీవనకాల సాఫల్య పురస్కారం దక్కింది.



## హైదరాబాద్‌లో తగ్గిన ఆఫీస్ స్పేస్ డిమాండ్



ముంబై, మార్చి 30: దేశంలోని 8 ప్రధాన నగరాలవ్యాప్తంగా ఈ ఏడాది జనవరి-మార్చిలో ఆఫీస్ స్పేస్ లీజింగ్ గతంతో పోల్చితే 44 శాతం పెరిగినట్టు తేలింది. వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేస్తున్న కార్పొరేట్లు.. ఆఫీస్ స్పేస్‌ను అందిపుచ్చుకుంటున్నారని తమ తాజా నివేదికలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తెలియజేసింది. ఈ క్రమంలోనే నిరుడు జనవరి-మార్చిలో 80.09 లక్షల చదరపు అడుగుల్లో జరిగిన ఆఫీస్ స్పేస్ నికర లీజింగ్.. ఈ ఏడాది జనవరి-మార్చిలో 115.14 లక్షల చదరపు అడుగులకు ఎగిసిందని వివరించింది. గడిచిన ఐదేండ్లలో ఇది మూడో అత్యంత ఎక్కువ స్థాయి అని కూడా పేర్కొన్నది. ఇదిలావుంటే బెంగళూరు, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై నగరాల్లో కార్యాలయ స్థలాలకు లీజింగ్ పెరుగగా.. పుణె, హైదరాబాద్, కోల్‌కతా, అహ్మదాబాద్‌ల్లో తగ్గింది. క్రిందటిసారితో పోల్చితే హైదరాబాద్‌లో ఈసారి 2 శాతం పడిపోయి 16,05,953 లక్షల చదరపు అడుగులకు ఆఫీస్ స్పేస్ లీజింగ్ పరిమితమైంది. నిరుడు జనవరి-మార్చిలో 16,40,242 చదరపు అడుగులుగా ఉన్నది.

